# ప్రొఫెషనల్ మేనేజ్‌మెంట్

శివ్రాజు

"అయ్ డోంట్ లైక్ దిస్." ఆ నెల ప్రొడక్షను ఫిగర్లు, ఎక్కౌంట్సు చూసి విరుచుకు పడిపోతూ అరిచేడు ఎక్స్—వై—జడ్ కెమికల్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టరు.

ప్రొడక్షను పెంచటానికి మెషినరీని, సిస్టమ్‌ని ఇంప్రూవ్ చెయ్యాలి. కార్మికులతో సత్సంబంధాలు నిలవాలంటే పెరుగుతున్న ధరల కనుగుణంగా వాళ్ళ జీతాలు పెంచి, వాళ్ళ వెల్‌ఫేర్ యాక్టివిటీస్ పెంచాలి. వీటిలో వేటికీ అదనపు ఖర్చు ఒప్పుకోడు ఎమ్.డి. కానీ, ఆ ప్రొడక్షను పెరుగుదల, సత్సంబంధాలు పైసా ఖర్చు లేకుండా సాధించాలంటా డాయన.

ఎంతో బోధపరచటానికి ప్రయత్నించి విఫలుడై మౌనంగా, దీనంగా కూర్చున్నాడు జనరల్ మేనేజరు. ఆ మీటింగ్‌లో కూర్చున్న మిగిలిన మేనేజర్లు కూడా గొంతులు పోయిన వాళ్ళలా మౌనంగా చూస్తూ కూర్చున్నారు.

"ప్రొఫెషనల్ మేనేజ్‌మెంటు అంటే ఏమిటి? ఖర్చులు బాగా తగ్గించి, లాభాలు ఇంకా బాగా పెంచాలి. అదీ...అదీ ఎఫిషియెన్సీ అంటే! అయ్ వాంట్ యువర్ గ్రూప్ టు వర్క్ లైక్ దట్... అంతే కాని, ఇలా జిడ్డిమొహాలు వేసుకొని కూర్చోవటం కాదు. వచ్చే నెలలో స్టాండర్డు ఖర్చులు తప్ప, పైన మరొక్క రూపాయి ఖర్చు పెట్టినా యూ ఫెలోస్ ఆర్ గోయింగ్ టూ లూజ్ యువర్ జాబ్స్...మైండిట్... నౌ యూ కెన్ గో..." గంటన్నర సేపు వీర ఉతుకుడు ఉతికి జి.ఎమ్. మొహాన కాగితాలు విసిరేస్తూ అరిచాడు ఎమ్.డి.



జి.ఎమ్.తో బాటు ప్రొడక్షన్ మేనేజరు, టెక్నికల్ మేనేజరు, పర్సనల్ మేనేజరు, ఎక్కౌంట్సు మేనేజరు నల్లబడిన మొహాలతో మీటింగ్ హాల్నుంచి బయటికొచ్చేశారు.

వాళ్ళకి నెల కొకసారి ఈ చిత్రహింస తప్పటంలేదు. కాకినాడలో ఈ కంపెనీ తాలూకు ఫేక్టరీ ఉంది. ఈ మేనేజర్లందరూ అక్కడుంటారు. హైదరాబాదులో ఈ కంపెనీ హెడ్డాఫీసు ఉంది. ఎమ్.డి. అక్కడుంటారు. సరుకు ఉత్పత్తికి ప్లాంటు పడే పాట్లు దూరాభారాన ఉన్న ఆయనకి అక్కరలేదు.

'చిన్నమెత్తు బంగారంలో మేలిమి కావాలి...మెడ తిరగాలి... నాలుగు పేటల గొలుసు చేసి గుంజెత్తు బంగారం మిగిల్చాలి' అనే రకం ఈ ఎమ్.డి.

"కష్టానికి తగిన ప్రతిఫలం కావాలి మొర్రో" అంటారు కార్మికులు. వాళ్ళకి రూపాయి ఇవ్వవలసినచోట అయిదు పైసలే ఇచ్చి మిగిలిన తొంభై అయిదు పైసలూ మన లాభాల్లో కలిపేసుకొందాం అంటాడు ఎమ్.డి. ఇరు వర్గాలకీ మధ్యన అడకత్తెరలో పోకచెక్కలాగ నలిగిపోతున్నారు ఈ మేనేజర్లు. వీళ్ళకి హిమాలయాలంత బాధ్యతలే కాని, చిన్న చెమ్మాడు అధికారం కూడా లేదు. ఎంత చెప్పినా వినిపించుకోడు.

ఇక ఇలాంటి మొగుడితో నెగ్గుకు రాలేమని నిర్ణయించుకొన్నారు ప్లాంటు మేనేజర్లు. రోజూ నలిగిపోయి చస్తూ బ్రతకటం కన్న, తాడో పేడో తేల్చుకోవాలనుకొన్నారు.

నాలుగు గంటల సుదీర్ఘ చర్చల అనంతరం ప్లాంటు మేనేజర్లు ఒక నిర్ణయానికి వచ్చారు.

ప్రతి నెలా ప్లాంటు ఖర్చుకి కావలసిన డబ్బు ఎంతో ప్లాంటు మేనేజ్‌మెంటు ఎమ్.డి.కి చెప్పాలి. దాన్ని కత్తిరించి కత్తిరించి వంద అడిగినచోట పది రూపాయలు, అదీ వారానికింత చొప్పున కాకినాడ బాంకుకి ట్రాన్స్‌ఫర్ చేయిస్తాడు.

చర్చల అనంతరం వాళ్ళు తీసుకొన్న నిర్ణయం ప్రకారం ఆ నెలలో, కాష్ ఫోర్‌కాస్ట్‌లో అరవై లక్షలకి బదులు ఆరు వేలే అడిగేరు ప్లాంటు మేనేజ్‌మెంటు. హైదరాబాదులో ఉన్న ఎమ్.డి.కి ఆనందంతో మతిపోయింది. తన ఫైరింగ్ పని చేసిందని సంతోషించేడు. అవును మరి! కింద పని చేస్తున్న వాడిని బానిసలాగ ట్రీట్ చేసి తిట్టటమే ప్రొఫెషనల్ మేనేజ్‌మెంటని అతని ఉద్దేశం.

మరునాటి నెల మంత్లీ మీటింగు షరా మామూలుగా హైదరాబాదులో జరుగవలసి ఉంది. కాని, ఫ్లయిట్ ఛార్జీల ఆదా కోసమని తాము రావటంలేదని, మంత్లీ రిపోర్టులు పంపుతున్నామని రాశారు ప్లాంటు మేనేజర్లు. దానికింకా సంతోషించాడు ఎమ్.డి.

ఆ సంతోషంలో తలమునకలవుతూ కాకినాడ ప్లాంటు నుంచి వచ్చిన కాగితాలు చూడసాగాడు ఎమ్.డి.

"ఈ నెల్లో ఖర్చులు అస్సలు లేవు..."

బాగుంది బాగుంది

"ఈ నెలలో ఏభై లక్షల ఖర్చు తగ్గించటం కోసం ముడిపదార్థం అస్సలు కొనలేదు."

బాగానే ఉంది!

అరే!! ఇదేమిటి?

"ఈ నెలలో ప్రొడక్షన్ కూడా అస్సలు లేదు. ప్రొడక్షన్ ఆపెయ్యటం ద్వారా స్టాండర్డు ఖర్చులు తప్ప అదనపు ఖర్చులు అవసరం రాలేదు కాకపోతే ఈ కొత్త ప్రక్రియవల్ల మూడు కోట్ల నష్టం వచ్చింది. అందులో అరవై లక్షల ఖర్చు కొట్టేస్తే చివరికి నష్టం రెండు కోట్ల నలభై లక్షలు"

అయ్యబాబోయ్...ఇది కూడానా?

"జీతాలు ఇవ్వని కారణంచేత కార్మికులు ఇచ్చిన...సమ్మె...నో...టీ...సు..."

ఓ మై గాడ్...అయ్యొయ్యో ఇదేమిటి?

"సరిగ్గా ట్రీట్‌మెంటివ్వని కారణంచేత, మరొక పది అర్థవంతమైన కారణాలచేత ఈ ఎమ్.డి. కింద పని చెయ్యలేమని మూకుమ్మడిగా చేసిన సామూహిక రిజిగ్నేషను లెటరు..."

"చచ్చేన్రా దే..."

ఆ గదిలో అప్పుడు ఢామ్మని చప్పుడవ్వవలసిందే కాని అవలేదు!

ఎందుకంటే?

ఎంత ఎమ్.డి.గారి గుండెకాయ అయినా, పేలిపోయేటప్పుడు చప్పుడు చెయ్యాలని రూల్సు లేవు కనుక!

*